అమ్మగారి పనులు ముగించుకొని ఆలోచిస్తూ యింటిదారి పట్టింది రంగి.

'పెట్టుపోతల్లేని పదిళ్ళపని చేసుకునేకంటె ఒక పెద్దింట్లో పనిచేసుకుంటే సరిపోద్ది' అనుకుంది తను (రంగి) రంగికి పెద్దిళ్ళన్నా పెద్దింటోళ్ళన్నా భయం

లేకపోలేదు అందునా ఆ యింటిబాబు కాస్త జల్సాగ్రాఁ వున్నమనిషే అని విన్నది ఆ అయ్య అందాలబొమ్మ ఆ అమ్మగార్నే గురుతుంచుకోరు, అమ్మగారి దాసీ లెక్కడ గుర్తుకొస్తారు. ఫరవాలేదని సాహసించి ఆనందయ్యగారింట్లో పనికి కుదిరింది తను (రంగి)

తెల్లారకుండానే పనిలోకి పోవడం, ఇల్లు గుమ్మాలు వూడవడం, అంట్లు తోమడం, అమ్మగారి స్నానానికి ఏర్పాట్లు చెయ్యడం, గాజు కుండీల్లో వాడినపూలు తీసిపారెయ్యడం క్రొత్తవి పెట్టడం, అమ్మగారి చీరెలు మాసినవీ మంచివీ వేటికవి సర్దడం అందులో తనకు మోజున్నచీర, కాస్త పాతగిలితే అమ్మగారు సంబరంగా వున్నపుడడగడం ఇంకా ఎన్నిపనులు రంగికి వాళ్ళ ఫలహారాలయాక వంటవాడు పడేస్తే తాను టిఫినుతిని ఆనక వంటలూ భోజనాలూ అయాక మిగిలిన సామానంతా సర్దుకుని గిన్నెలు తోమియిచ్చేసి యింటికి రావడం, మామకి వేడ్నీళ్లు సిద్ధంచేసేసరికి వాడు స్నానం చేసివచ్చి తినుకుంటూ కసుక్కున ఎవ్వుకుంటూ మస్తుగా గొప్పింటి భోజనం ముగిస్తాడు ఆనక తను కాస్త తిని మళ్ళీ మూడుకాకుండా అమ్మగారింట్లో హాజరుకావడం

అమ్మగారు సాయంత్రం తలంటి పోసుకుంటారు, తను సాంబ్రాణిధూపం వేస్తుంది సాంబ్రాణి సువాసనలు తనకెరికే గాని అదేటో అమ్మగారు స్నానం చేసిరాగానే, మొగిలిపూవులా, సంపెంగపూవులా రకరకాల సువాసన స్నానమాడేటపుడు ఏటి రాసుకుంటారో ఏటో – అన్నీ అడగడానికి భయం తనకి

ఆ తరువాత అమ్మగారు సానా అందంగా ముస్తాబవుతారు అమ్మగారి గదివేరు అయ్యగారి గదివేరు. అమ్మగారి గదిలోకి అయ్యగారు రావల్సిందే గాని ఆరి గదిలోకి అమ్మగారు ఎల్లడానికి వీలులేదు రోజూ రోజా పువ్వులా తయారయే అమ్మగారి గదిలోకి రోజూ వస్తారో రారో అయ్యగారు? ఏంటో పెద్దింటోళ్ళ గొడవలు

అయ్యగారి వివరాలు అమ్మగారికెవరూ చెప్పరు అమ్మగారు మాత్రం ఏలాగడుగుద్ది పెద్దింటిది, అభిమానం కాదూ! పోతే నౌకరీ చాకిరీచేసే తామైనా నోరిప్పుకోరు అలా యిప్పుకుంటే గుండెలు పేల్చెయ్యరూ! ఆ నాలుగు గోడలమధ్య ఒకరికొకరు పనులు చేసుకోవడమేగాని ఓ కాడ కూర్చుని మాటాడుకోరు బైట గుసగుసలనుకున్నా యజమానులతో ఫిర్యాదులు చెప్పుకోరు ఒకళ్ళకూట్లో ఒకరు దుమ్ముపోసుకోరు అనుకుండే. అలాటి యిద్దెలన్నీ పెద్దింటోళ్లే పడతారు ఆ యింటిసంగతులన్నీ ఎవరి మనసు

కారికే ఎరిక అంతగుట్టు! అంతా తను సన్నల్లో మసలాల్సిందే

అయ్యగారు అమ్మగారి గదిలో నిద్రకొస్తే అమ్మగారు ప్రొద్దుటే లేచి పోయి వస్తు కాఫీ అమ్మగారే పట్టు కెడతారు ఒకవేళ అయ్యగారి గదిలో అయ్యగారుంటే అమ్మగారు ఎనిమిది గంటలదాకా టేబిల్ కాడ టిఫినీలు తిండానికి ఎదురు చూస్తూ కూర్చో వల్సిందే

అమ్మగారు అయ్యగారి గది ప్రవే శించడానికి వీలులేదు

అమ్మగారొక మల్లెమొగ్గ, మెరుపు తీగ కాని, అదేటో మొగలిపువ్వులా ఎప్పుడూ ముడుచుకున్నట్లు వుంటది అయ్యగారితో కాపరం ఆమె కెలా గుందో ఎవరి కెరుక కాని తనతో మాత్రం సర్దాగా సానామాట్లాడుద్ది.

సాయంత్రం స్నానమయాక తల తుడుస్తూన్నపుడూ సాంబ్రాణీపొగవేస్తు న్నపుడూ అమ్మ అడుగుతాది – "రంగీ మీమావు ఎలా వుంటాడే" అని నవ్వుతూ

"మా కందాలేటి అమ్మగారూ బలంగుంటేచాలు కష్టపడి పనిచేసుకని కడుపు నింపుకోవాలి"

"పోనీ నిన్ను బాగా చూస్తాడా?"

చిన్నగా నవ్వుకుంటుంది తను "నే నంటె పడిచస్తాడు అమ్మగారూ మీ రిచ్చే చీరెలూ, రవికెలూ, సింగా రించానంటే ఊపిరాడనియ్యడు ఏదొ చ్చినా గొడవేకదా వాడితో"

అమ్మగారు ఉత్సాహంగా వింటుంది "అయితే మీలో చాలామంది తాగుతా రనీ పెళ్ళాల్ని కొడతారనీ పెళ్ళాం డబ్బుతోటే సంసారం గడపాలనీ అను కుంటారే?"

"ఎవరో పోకిరి యదవలట్టాగే అమ్మగారూ! కాని మా మావ అల్లా కాదు" ఆ మాటలంటూ తను తల వాల్చేసుకుంటుంది, సిగ్గేమో అని అమ్మగారు అనుకోవాలె

రంగి యింటి గుమ్మందగ్గర కొచే సింది ఆలోచనలు ఆగిపోయాయి

రాజయ్య అప్పటికే వచ్చి మంచం మీద అడ్డంగా పడుకున్నాడు రంగి రాగానే లేచికూర్చున్నాడు సారా కంపు వెంటనే తెల్సుకుంది రంగి

పొయ్యికేసి నడుస్తుంటే పట్టుకు నిలె సాడు రాజయ్య "సానాబాకీ అయ్యింది డబ్బులు పడెయ్యి యిచ్చేసి వస్తా"

"నా దగ్గర డబ్బులు కూడా నీ సారాకే తగలెడితే మనం ఏం తింటాం నీ గడిస్తున్న డబ్బులు నే నడిగానా నాయి నీ వడగడానికి నా దగ్గ రేం లేవు ఎళ్ళు"

"ఎప్పటి కపుడు కొత్తగా మాట్లా డకే రంగీ! నీ దగ్గర లేకపోవడ మేమిటి, పెద్దింటి సిలకవి నీ సింగారం నీ బంగారం నాకు తెల్దేటి! బాబు ఊరికే

యిస్తాడా ఎవన్నీ నీ యిష్టమే! నీ యిష్టాని నీ ఎం అడ్డంరాను డబ్బు మాత్రం యిలా పాడెయ్యి. నామాట మర్యాదగా యినుకో!"

"నీ జిమ్మడ. నాకు రంకు కడతా ఏంటూ. బంగారు బొమ్మలాంటి ఆ అమ్మకేసే చూడ్డు ఆ దొర. ఏ దొరసాను లతో వుంటాడో ఏటో. రోజూ ఎంతో సింగారించుకుంటే ఆ అమ్మ, ఏదో ఒక రోజు అవిడ గదిలో కెళతాడు. ఆ యమ్మకి నీ వెంతో మంచివాడవని చెబుతా. బాగా చూస్తావని చెబుతా. సంబరపడి యియన్నీ నా కిస్తాది. నీ నాలిక పీకా, నానుసానిపనిచేసి నీతాగుడికి తెస్తానుట్రా. నీ డబ్బేదో నీవు తగలెడుతున్నావ్, పోనీ యి ల్లి యి నా జరుగుద్దని కష్టంచేసి తెచ్చి నీయదాన్ని పెడుతున్న అడబుద్ధికొద్దీ. నీ మగబుద్ధి పోనిచ్చుకున్నావ్ కాదు. రేపటి నుంచి పనికే ఎళ్ళను."

"ఏటీ నీ ఇష్ట మొచ్చినట్లు నిన్ను ఏసాలెయ్యనిచ్చి డబ్బులు చాలే అంటే అయూ యియ్యవూ? ఎలాగియ్యవో చూస్తా" అని రాజయ్య రంగి జుట్టు పట్టుకుని పడదీసి బాత్తుంటే అమ్మో అయ్యో అని వోపికున్నంతవరకు అరచి ఆనక రంగి బొడ్లో రూపాయలు దూరంగా విసిరిపారేసింది.

అవి పట్టుకుని మరుక్షణంలో మాయమయ్యాడు రాజయ్య. ఆ రోజుకిక తిండీ నీళ్ళూ సున్నా రంగికి

* * *

శారద ఆ రాత్రి ఎంతో ఎదిరి చూచింది. భర్త తన గదిలోకి వస్తాడనే ఆశ క్షణ క్షణమూ క్షీణించసాగింది. ఏంటో ఈ జీవితాలు! గొప్పవారి జీవితాలు యిలా గొప్పల్తో గోడలు కట్టబడ్డాయా? కాకుంటే ఆయనకు దయ వచ్చిననాడు, ఆయనకి గుర్తు వచ్చిన నాడు తన గదికి రావడం. దాని కెంతో చెప్పడం, తాను అడగాలనుకున్నవి అడగకుండానే నోరు మూత బడటం. తాను మాత్రం మనసైనప్పుడు భర్తని పిలవలేదు. ఎందుకు పోలేదు? భయం. ఆ గదిలోకి ఎవ్వరూ వెళ్ళరు. అది ఆయనగారి ఆజ్ఞ. తనూ వెళ్ళరాదు. ఎందుకు వెళ్ళరాదు? ఈ రోజు వెళ్ళి తీరుతుంది. ఏమైనాసరే. ఏముంది ఆ గదిలో? తన భర్త దగ్గరికి తను వెళ్ళడానికి ఆలోచన దేనికి? నెమ్మదిగా తడబడే అడుగులతో ఆ గది దాటింది. ఎన్నడూ చేయని పని చేయబోతున్నందుకు గుండెలు దడదడా కొట్టుకుంటున్నాయి.

నెమ్మదిగా ఓరగా వేసిన తలుపు తెరుచుకుని భర్తగది ప్రవేశించింది!

గదిలో అలవోకగా పడుకుని పేక ముక్కలు పట్టుకుని ఎదురుగా ఎవరో వున్నట్లు టేబిల్ మీద ముక్కలు పడే

స్తున్నాడు భర్త ఆ చిన్న టేబిల్ మీద కాళీసీసా గ్లాసూను. జంకుతో వెనక అడుగు వేసి మళ్ళీ తమాయించుకుని ముందడుగు వేసి చిరునవ్వుతో – "మీలో మీరు ఒక్కరే ఆడుకోవడమేం. నన్ను ఆడమంటే ఆడనూ" అంది.

నివ్వెరపోయి చూసాడు ఆనందు. కళ్ళు ఎర్రగా వున్నాయి. పేక ముక్కలు విసిరేసాడు. చూపుల్లో నిప్పులు కురుస్తున్నాయి. "ఎవర్నడిగి వచ్చావ్?"

ఆ గొంతుక ఆతీరు–హడలిపోయింది శారద. "అడగలేదు.. కాని – కాని నా మనసు కాళ్ళు మీ దగ్గరికి లాక్కు వచ్చేసాయి." అంతకుమించి మాట్లాడ

లేకపోయింది. భర్తతీరుకు భయంతో కంపించిపోయింది, శారద.

'అయితే రా' అని ఆమెను బలంగా చేతులుపట్టి లాగి మంచంమీద పడవేసాడు. మోటుగా బుగ్గల చర్మం వూడేలా కరిచాడు. అకస్మాత్తుగా లేచి నించున్నాడు.

భర్తయొక్క యిలాంటి రూపం ఈ ప్రవర్తన ఎన్నడూ చవిచూడలేదు శారద. యిదంతా తాగుడు వ్యవహారం కాబోలని గ్రహించడానికి కాస్తే సేపు పట్టలేదు. భయంతో ఒణుకుతూ రెండు చేతులూ జోడించింది. "తప్పే చేసాను, క్షమించండి. ఇంక ఎప్పుడూ మీ గదికి రాను."

దగ్గరలోవున్న బెల్టు చేతిలోకి తీసుకుంటూ అన్నాడు. "నువ్వు క్షమించరాని తప్పు చేసావు. శిక్ష అనుభవించాల్సిందే. కిక్కురుమన్నావంటే చూడు!" అన్నాడు.

చావు తప్పదు కాబోలు అనుకుని విలవిల్లాడిపోయింది శారద. ఒకటి రెండు దెబ్బలకే స్పృహతప్పి మంచం మీదనుంచి జారి క్రిందపడిపోయింది. ఆ తరువాత ఏం జరిగిందో శారదకి తెలియలేదు. ఆమెకు తెలివివచ్చి చూసేసరికి భర్త వోవార తనలాగే ఒంటిమీద సరిగా బట్టలైనా లేకుండా పడివున్నాడు. భయంతో నెమ్మదిగా జరిగి అతని గుండెలమీద చెయ్యివేసి చూసింది. గుండెలు కొట్టుకుంటూనే వున్నాయి. నాడి చూసింది అది కొట్టుకుంటూనే వుంది. ఫరవాలేదని వూపిరి పీల్చుకున్నాక ఒక్క క్షణం ఆలశ్యం చెయ్యలేదు. వెంటనే గదితలుపు తీసుకుని డాబామీదకు వచ్చి డాబామెట్లు గబగబా దిగిపోయింది.

తన వెనుక అయనా వస్తున్నాడేమో అనే భయంతో దొడ్లోకి పరుగుతీసి పూలమొక్కల్లో దాక్కుంది. కాస్సేపు ఎవరూ రాకపోవడంచూసింది. ఏ నౌకర్ల చేతయినా తనని పట్టిస్తారేమో అని అనుకుంది. నౌకర్లు అనే వూహ రాగానే రంగి గుర్తువచ్చింది అనేకసార్లు రంగి తమ డాబామీదనుంచి తమ గుడిసె చూపించింది ఆట్టేఆలశ్యం చెయ్యకుండా దొడ్డితలుపు తీసి పరుగున రంగి యింటికొచ్చి వాలింది.

రంగి యింట్లోకూడా ఆ అర్ధరాత్రి ఏదో రభస జరుగుతోంది. తలుపు దగ్గరే చతికిలబడిపోయింది శారద.

లోపలినుంచి మాటలు.

"జీతం నెలకొచ్చేట్టు యిస్తారే గాని అస్తమానూ యిస్తార్రా నువ్వు తాగి తందనాలు తొక్కడానికి" అంది రంగి.

"ఎప్పుడు నువ్వు సజావుగా ఇచ్చావు గనుక. బాకీ జమకట్టాలి. చూస్కో నీ వోపిక."

"నన్ను చంపినాసరే నా దగ్గర యిప్పుడు డబ్బులేదు.''

"నువ్వు అలా ఇంటావ శేం! బంగారు పిచ్చుకనుపట్టి నీదగ్గర డబ్బులేకపోవడమేమిటి. పోనీలే అనివూరుకుంటే..."

"నీ నోరు పడిపోనూ ఆ మాటనకురా నాకు కంపరమొస్తూంది."

మరొాట్టే మాట్లాడకుండా మీద కురికాడు రాజయ్య

వాడి దెబ్బలూ రంగి అరుపులూ, ఆగలేకపోయింది శారద. [illegible] తోసుకుని ఆగు అని అరుస్తూ లోపలికొచ్చింది. అదే టైమ్‌లో "రేపీపాటికి డబ్బు జత పర్చకపోయావో చూస్కో నా తఢాకా" అని, రంగిని గుమ్మంవైపు తోసివేసాడు. ఆ విసురుకి రంగి వచ్చి శారదమీద పడగా శారద కిందకు పడిపోయింది.

"ఏలెహె ముదనష్టపోళ్లు" అని విసుక్కుంటూ రాజయ్య వీధిలోకి వెళ్ళిపోయాడు. అంతేకాని వచ్చిన మనిషెవరో పట్టించుకోలేదు. రంగి మాత్రం క్షణంలో గుర్తించింది. "అమ్మగోరూ మీరా యిలా వచ్చారేంటి" అంది విభ్రాంతితో.

తొందరగా వెళ్ళి వీధి తలుపు మూసేసింది. నులకమంచం వాల్చి వున్న దాంట్లో ఉతికిన చీర పక్క వేసింది. శారదని నెమ్మదిగా తీసుకు వచ్చి మంచం మీద పడుకోబెట్టి గోలున ఏడ్చేసింది రంగి. "అమ్మగోరూ వంటికేంటయినాది? ముఖం మీద ఈ నెత్తురేటి? ఏంటయినాదమ్మా?"

బాధతో మూలుగుతూ చెప్పింది శారద. "అన్నీ చెబుతా రంగీ! అయినా నువ్వు తెల్సుకోలేనిది కాదు" అంది వెర్రిగా నవ్వుతూ. రంగి స్వతహాగా దిట్ట. ధైర్యవంతురాలే. కాని అమ్మగారిలా రావడం యిలా వుండటం బేజారెత్తిపోయి ఏమీ పాలుపోక అటూ యిటూ కంగారుపడి తిరుగుతోంది. వేడి నీళ్ళు పెట్టి తెచ్చి దెబ్బలుతగిలి నెత్తురు చిందిన భాగాలన్నీ తుడిచింది. కొబ్బరినూనె వెచ్చచేసి వెల్లుల్లి పసుపూ వేసి గాయాలకి రాసింది. 'ఛీ యిదేం వయిద్యగం' అని ఆ నూనె తుడిచేసి తన పెట్లో ఆ అమ్మగారే యిచ్చిన స్నో పౌడర్లు తెచ్చి రాసింది.

రంగి సేవకి, ఆప్యాయతకి, అలజడికి కరిగిపోయింది శారద. శారదకి ఎక్కడలేని శక్తి వుత్సాహాలూ వచ్చాయి. 'రంగీ!' అని ఆప్యాయంగా అమాంతం రంగిని కౌగిలించేసుకుంది. 'రంగీ నాకు వేడి వేడిగా ఏదైనా త్రాగడానికి యిస్తావా?'

రంగి యింత సేపూ తన కా ఆలోచన రానందుకు తిట్టుకుంది. "మా యింట్లో ఏటుంటదమ్మగోరూ? సినిమా హాలుకాడ వేడి టీ వుంటాది తేనా" అంది.

"వద్దు రంగీ! నువ్వు నన్ను వదిలి వెళ్ళొద్దు."

"అయితే ఎట్లా?"

"గంజి లేదూ?"

"గంజా! పంచభక్ష పరమాన్నాలు తిని ఒకరికి పెట్టే మీకు గంజి ఎట్లా గియ్యనమ్మగోరూ?

"అదే యిప్పుడు అమృతంలా ఉంటాచ్చు. కాస్త పల్చనచేసి వేడి చేసి ఉప్పు వేసి తీసుకురా. వేడి వేడిగా ఏదైనా తాగుతేగాని ప్రాణం కుదురు పడదు."

గత్యంతరం లేక గంజే వేడిచేసి ఉప్పు వేసి గాజుగ్లాసులోపోసి యిచ్చింది దుఃఖపడుతూ రంగి.

వేడి వేడిది తాగాక కాస్త తేరు కుంది శారద. "రంగీ నీ మామ కొట్టడనీ తాగడనీ ఎందుకు అబద్ధం చెప్పావ్?" రంగి సిగ్గుతో తలవంచు కుంది. ఏం చెప్పాలో క్షణం పాలు పోలేదు, చివరికిలా చెప్పింది. "మీ రేటో మనేగా కనిపించేవారు. నా సుఖమే గాని కష్టం చెప్పడమెందుకులే అని అలా చెప్పానమ్మగోరూ! మిమ్మల్ని బాధపెట్టకూడదు, సంతోషపెట్టాలని."

రంగి అమాయకమైన అంతరంగానికి ఆనందంతో నిండిపోయింది శారద మనసు. తన భర్తా భయంకర సత్యాన్ని తననుంచి దాచాడు. రంగీ దాచింది. కాని ఏం లాభం? నిప్పులాంటి నిజం తనని కాల్చనే కాల్చింది.

"అమ్మగోరూ! మీరు తెల్లారకుండా యింటి కెళ్ళిపోతే బాగుంటాది."

"నే నింకా ఆ యింటి కెళ్ళలేనే"

"అదేటమ్మగోరూ"

"అవంతే. సాహసించి అయ్యగారి గది కెళ్ళాను. నిజం తెలిసిపోయిందని అయ్యగారికి ఎక్కడలేని కఠూ వచ్చేసింది. నన్ను ఎప్పుడు ఏమైనా చెయ్యొచ్చు. నేను ఆయన చేతుల్లో చచ్చి ఆయన్ని జైలుకు పంపడం మంచిదే నంటావా?"

రంగికి ఎక్కడలేని దుఃఖమూ వచ్చింది. ఎంతపని జరిగింది. తను విన్న గాలికబుర్లన్నీ నిజమేనన్నమాట! పాపం అమ్మగారు ఉత్తారం మనిషి. తానేంటి ఎప్పటికపుడు దెబ్బలుతిని దులిపేసుకోడానికి. "అయితే అమ్మగోరింటికి వెళ్ళిపోతారా అమ్మా."

"ఊహు."

"మరెక్కడ కెడతా రమ్మగారు ఒంటిగా?"

"ఇంత విశాల ప్రపంచంలో నాకు చోటే దొరకదంటావా? నేను కాస్త పూరుదాకేవరకు సాయం రాగలవా?"

"ఎంతమాటమ్మగోరు! నా ప్రాణమైనా వదులుతాగాని మిమ్మల్ని వదులుతానా?"

"మరి మీ మామ?"



"ఏడిశాడు. రంకుపని చేసయినా తన తాగుడికి డబ్బు తెమ్మంటున్నాడు. ఎంతకని చస్తా నమ్మగారూ! నాప్రాణం విసిగిపోయిందది. అమ్మగోరింటికి పోదా రనుకుంటున్నాను. మా కేటమ్మగోరు! మాలో మా రు మను ములు కూడా వుంటాయి. నేనుగాబట్టి యిన్నేళ్ళి కనిపెట్టుకుని దెబ్బలు కాస్తున్నాను."

"తొందరగా ప్రయాణం సంగతి చూడు. ఏదైనా చిన్నపెట్టె తీసుకురా. ఈ నగలన్నీ తీసి అందులో దాచాలి."

రంగి తొందరగాలేచి చిన్నపెట్టె తీసుకు వచ్చింది. అందులో తన ఖరీదైన నగలన్నీ తీసేసి రంగిచేత సర్దించింది. తనెప్పుడో రంగికిచ్చిన పాత చీర కట్టుకుంది. తను కట్టుకున్న చీర పెట్లో పెట్టించేసింది శారద.

"అయితే స్టేషన్ వెడదామా?" అంది రంగి

"అక్కో స్టేషన్ వద్దు బస్‌స్టాండ్‌కి వద్దు. ఇలాంటివన్నీ అయ్యగారు నౌకర్ల చేత గాలింపించి పరుగులు పెట్టించవచ్చు. ఏదైనా పల్లెటూరికి రెండెడ్ల బండి మాట్లాడు, తొందరగా—"

* * *

ఒక పల్లెటూరు చేరుకుని అక్కడ స్థిరపడింది శారద. ఆ వూరి స్కూల్లో టీచరుగా పనిచేస్తోంది. ఒకటే పెద్ద హాల్లో ఒకే ఒక మేష్టరు అక్కడ పిల్లలకి చదువు చెపుతున్నాడు. అందులో ఆడపిల్లలకి తను చదువు చెబుతోంది ఆ హాల్లోనే కాస్త భాగం తనకి కేటాయించుకుని తడిక అడ్డం కట్టించుకుంది రంగి అనుక్షణం కంటికి రెప్పలా శారదని కాపాడుతుండటంవల్ల, శారద కాలం సులువుగానే దొర్లిస్తోంది.

పల్లెటూరులో రకరకాల ప్రశ్నలు పుట్టకపోలేదు వాటి నన్నిటినీ శారద ఒకి సోకకండా రంగి వీలైనంతవరకూ తన తెలివితో అణిచేస్తోంది.

రెండుమూడు నెలలా పల్లెటూళ్ళో గడిపేసరికి శారద ప్రాణం విసిగి పోయింది తనలా బ్రతకలేననిపించింది ఏం చేయడానికి పాలుపోలేదు. తన లాంటి ఒంటి ప్రాణం ఆ పల్లెటూళ్ళో మనలేదు. సరైన రక్షణా వుండటం కష్టం. ఏ పట్నమైనా పోయి ఏ లేడీస్ హాస్టల్లో అయినా వుంటే, తన మనసుకు వూరట కల్గవచ్చు. రంగిని దాని అమ్మగారింటికి పంపేస్తే మంచిది. తన కూడావుంటే తనని గురించి దానికి చికాకులు రావచ్చు. ఈ విధంగా సాగుతున్నాయి శారద ఆలోచనలు.

ఎప్పుడూ ఎవరింటికీ వెళ్ళలేదు శారద. ఎవరితోటీ పరిచయంలేదు. ఆరోజు మేష్టారింటికి వెళదామని బయలుదేరింది గుమ్మంచేరేసరికి లోపలనుంచి ఏవో కేకలూ గొడవా వినిపించేసరికి గోడపక్కకి తప్పుకుంది. ఒక వారగా లోపలి రభస కనిపిస్తోంది. కనుచీకటిగా వుంది.

"నిన్నటినుంచీ పిల్లకి జ్వరంకదా, సాయంత్రం పెందరాళే యింటి కొద్దామనైనా వుండొద్దూ! అయినా ఎందుకు వుంటుంది లెండి, అంత అందమయినది కళ్ళెదురుగా వుంటే. నా కెక్కడ దాపురించిందో శనిలా! అదొచ్చినప్పటినుంచీ మీ వాలకం బాగోలేదు."

"నోరు ముయ్యి. నోటికొచ్చినట్లు మాట్లాడకు. ఆవిడెవరో అయినింటి ఆడపడుచులా వుంది. ఏదో కష్టంవచ్చి దారి తప్పి యిలా వచ్చినట్లు వుంది నువు చూడా పెట్టందే యిలా మాట్లాడకు."

"నానోరు మూస్తాను లోకంనోరు మూస్తారా?"

మేష్టారింక భరించలేక పోయాడు "నీకు నేను లెఖ్ఖా లోకం లెఖ్ఖా! ఆవిడపట్టుమని నాల్గు మాటలైనా మాట్లాడదు నోరుముయ్యి."

"ముయ్యను, ముయ్యను గాక ముయ్యను. అంతా తేల్చేస్తాను" అంది రెచ్చిపోయి.

ఆమాట శాంతాదేవి నోటినుంచి వచ్చిందోలేదో, మేష్టారు మీదికురికి నాల్గు బాదారు. నోరు మూస్తావా లేదా అని జుట్టు పట్టుకుని గుంజి పారేసారు.

మరింక చూళ్ళేకపోయింది శారద క్షణం నిలబడలేక పోయింది. చకచకా యింటికివచ్చి పడింది.

* * *

ఆ మరునాటి మధ్యాహ్నం. శాంతాదేవి ఏదో పనితో వుండగా స్కూలు కుర్రాడో చీటీయిచ్చి వెళ్ళిపోయాడు ఏమిటబ్బా అని విప్పి చదవడం ప్రారంభించింది మాష్టారి భార్య.

"శాంతాదేవీ! రాకరాక మీ యింటికి వచ్చాను. నేను ఏదైతే చూళ్ళేనో అదే చూసాను. ఏదైతే వినలేనో అదే

విన్నాను. యింతవరకు నా వూహా వేరుగా వుంది. కొందరు గొప్పవాళ్ళు డబ్బు బాగా వుండటంవల్ల విలాసానికి తాగి తందనా లాడతారు. కొందరు పేదవాళ్ళు మూర్ఖత్వంకొద్దీ తాగి ఆలిని చావబాది యింట్లో డబ్బుదస్కం పెళ్ళాం సంపాదన పట్టుకుపోతారని విన్నాను. చూశాను. కాని మధ్యతరగతి వారి కిలాంటి బెడదలు వుండవనుకున్నాను. ఆర్థిక యిబ్బందులు తప్ప వారిని యిలాంటి విషయాలు బాధించడానికి రావనుకున్నాను. మీరు తాగకపోయినా తాగినట్లు మాట్లాడారు. మేష్టారు తాగి రాకపోయినా తాగినవాడిలాగే కొట్టారు. యిందుకు మూలకారణం నేనైనందుకు చాలా సిగ్గుపడుతున్నాను.

మీకు పాపం నా సంగతి తెలియదు. నేను గొప్పయింట్లోపుట్టాను. గొప్పగా పెరిగాను. గొప్పయింటికే కోడల్ని అయ్యాను. నాకు ఏ లోటూలేదు. వున్న ఒకేఒక లోటు నన్నక్కడ నిలవనిచ్చింది కాదు.

నా గదికి నా భర్త రావడమేగాని వారిగదికి నే నెప్పుడూ వెళ్ళలేదు. ఆ యింట్లో నాఉనికి ఏమిటో బోధపళ్లేదు. నా భర్త నా చేరువకి రావడమేగాని వారి చేరువకి వెళ్ళలేక పోయాను. అలా వెళ్ళాలని తీవ్రమైన కోరిక కల్గిన రోజున వారి గదికి వెళ్లాను. తీవ్రంగా శిక్షింపబడ్డాను. అంతవరకూ నా భర్త యొక్క నిజస్వరూపం నాకు తెలియదు. తెలిసినాక ఆ యింట్లో ఒక్క క్షణం వుండలేక పోయాను. ప్రాణభీతితో పారిపోయాను. కంటికి రెప్పలా కాపాడుకోడానికి రంగి నాకు తోడుగా వచ్చింది. అదీ తాగిన భర్తతో తన్నులుతింది. నేనూ తిన్నాను. మీరూ తిన్నారు. కాని ఒక్కటి. నేను బాధ భరించలేను. ఎవర్నీ బాధించలేను. నావల్ల మీకింక బాధలేకండా ఈ వూరినించి వెళ్ళిపోతున్నాను. పొట్టకోసం పని చేయాల్సిన అవసరంలేదు. నా దగ్గరున్న నగలు నన్నుజీవితాంతం పోషించగలిగినంత ఖరీదైనవి. కాని కాలక్షేపం కోసం పని కల్పించుకున్నాను. నాకు యిక్కడ ఏమీ తోచడంలేదు. పట్నంపోయి ఏ లేడీస్ హాస్టల్లో అయినా చేరుతాను. రంగిని పంపేస్తాను. నాకు మంచిదారీ కర్తవ్యం పరోక్షంగా చూపించిన మీకు నా ధన్యవాదాలు. మీ శ్రేయోభిలాషి శారద టీచర్."

ఉత్తరం పూంతం చదివి తెల్లబోయింది శాంతమ్మగారు. దిగాలుగా దొడ్లోకి చూస్తుంటే – దొడ్లో తన కొడుకు జామచెట్టుమీది చిలకను రాయి విసరగా చిలక ఎగిరిపోయింది. జామ పండు కింద రాలింది. తనకొడుకు రాయి విసురుతే చిలక పండు విదిలించింది. ఈ మామూలు సంఘటనలో తెలియరాని దేదో తెలియజెప్పినట్లయింది శాంతమ్మగారికి.